
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 36.0 ׀ కనిష్ఠం : 24.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:35 (శనివారం సాయంత్రం)
సహర్: 4:58 (ఆదివారం ఉదయం)



డీలిమిటేషన్‌తో అన్యాయం

- జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన వద్దే వద్దు..
- ఈ నెపంతో అధిక సంతానం ఉండాలనే నినాదం కూడా తప్పే..
- అవసరమైతే ఈ ప్రక్రియను వాయిదా వేసి, న్యాయం చేయాలి
- గతంలో మాదిరిగానే 1971 లెక్కలనే ప్రామాణికంగా తీసుకోవాలి
- ఉమ్మడి పాలమూరులో 'ఆంధ్రజ్యోతి' సర్వేలో వెల్లడించిన ప్రజలు
- డీలిమిటేషన్- దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయంపై నేడు చెన్నైలో చర్చ


పార్లమెంట్ భవనం

ఆంధ్రజ్యోతి సర్వే

మహబూబ్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 2026లో జరగాల్సిన పార్ల మెంట్ నియోజకవర్గాల పునర్విభజ నపై తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఈ నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలు తమకు అన్యాయం జరుగుతుందని స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర ముఖ్యమం త్రి రేవంత్‌రెడ్డితోపా టు బీఆర్ఎస్, కమ్యూని స్టు పార్టీలు కూడా ఈ పునర్విభ జనను వ్యతిరేకిస్తున్నాయి. కేం ద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మాత్రమే నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగ దని వాదిస్తోంది. ఈ నేపథ్యంలో తమిళనా డులోని అధికార పార్టీ డీఎంకే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన పార్టీల నాయకులతో చెన్నై వేదికగా శనివారం సమావేశాన్ని నిర్వ హించనుంది. ఈ సమావేశానికి సీఎం సహా ఇతర పార్టీలందరికీ డీఎంకే ఆహ్వానం పం పింది. బీఆర్ఎస్ ఇప్పటికే తాము వెళ్తామని ప్రకటించగా.. సీఎం రేవంత్‌రెడ్డి కూడా పార్టీ అనుమతితో వెళ్తానన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రస్తుతం రెండు లోక్ సభ నియోజకవర్గాలు ఉన్నాయి. నాగర్‌కర్నూల్ నియోజకవ ర్గంలో 17.45 లక్షల మంది ఓటర్లు ఉండగా, జనాభా ఇంచుమించుగా 25 లక్షలపైనే ఉంటుంది. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 16.95 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడా జనాభా ఎక్కువగానే ఉంది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన

(మిగతా 6లో..)

నేడు ఆంధ్రజ్యోతి బంపర్ డ్రా

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న డీఎస్పీ

మహబూబ్‌నగర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి 22వ వార్షికో త్సవాన్ని పురస్కరించుకుని కార్ అండ్ బైక్ రేస్ బంపర్ డ్రా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నారు. మహబూబ్‌నగర్ అప్పన్నపల్లిలోని తిరుమల హిల్స్‌లో గల ఆంధ్రజ్యోతి ఎడిషన్ కార్యాలయంలో ఉదయం 10:30 గంట లకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఇప్పటికే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పాఠకుల నుంచి 'ఆంధ్రజ్యోతి' కూపన్లు పెద్ద ఎత్తున ఎడిషన్ కార్యాలయా నికి చేరుకున్నాయి. జిల్లా ఎడిషన్ పరిధిలో జరిగే లక్కీ డ్రాలో మొదటి బహుమతిగా బైక్, ద్వితీయ బహుమతిగా 185 లీటర్ల రిఫ్రిజిరేటర్, తృతీయ బహుమతిగా 32 ఇంచుల ఎల్ఈడీ టీవీ ఇవ్వనున్నారు. అదేవిధంగా 100 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు.

గడువులోగా మంజూరు చేయాలి

- కలెక్టర్ విజయేందిర బోయి


మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్స హిస్తూ, టీజీ ఐపాస్ ద్వారా పరి శ్రమల స్థాపనకు వివిధ శాఖల నుంచి అనుమతులను నిబంధ నల మేరకు నిర్దేశిత గడువులోగా మంజూరు చేయాలని మహబూ బ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి చెప్పారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా పరిశ్రమల ప్రోత్సా హక కమిటీ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. టీప్రైడ్ ద్వారా షెడ్యూల్డు కులాల వారిలో ఒకరికి ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్ కింద ఒక కారు, షెడ్యూల్డు తెగల వారిలో ఇద్దరికి కార్లు, ట్రాక్టర్ అండ్ ట్రైలర్స్ వాహనాలకు పెట్టుబడి సబ్సిడీ మంజూరునకు కమిటీ ఆమోదం తెలిపింది. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లలో కనీస సదుపాయాలకు సంబంధించి చిన్న చిన్న పనులు ఉంటే చేయాలని టీజీఐసీ జోనల్ మేనేజర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పి.ప్రతాప్ రెడ్డి, ఎల్‌డీఎం భాస్కర్, భూగర్భ జలవనరుల శాఖ డీడీ రమాదేవి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రావణ్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.


భూత్పూర్ మండలం రావులపల్లిలో పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది



పన్ను వసూలులో మూడో స్థానం

- మహబూబ్‌నగర్ జిల్లాలోని పంచాయతీల్లో 95 శాతమే వసూలు
- ఈ ఆర్థిక సంవత్సరానికి మిగిలింది 10 రోజులే..
- మహబూబ్‌నగర్, మూసాపేట మండలాల్లో 100 శాతం..

మహబూబ్‌నగర్ న్యూ టౌన్, మార్చి, 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచా యతీల్లో పన్ను వసూలు విష యంలో మహబూబ్‌నగర్ జి ల్లాకు రాష్ట్రంలో మూడో స్థానం దక్కింది. ముం దుగా ప్రభుత్వం సం క్రాంతి తర్వాత పంచా యతీ ఎన్నికలను నిర్వహి స్తామని చెప్పింది. దాంతో కార్యదర్శులు ఎన్నికల బిజీలో ఉండటం వల్ల పన్ను వసూలు మందకొడిగా సాగింది. తర్వాత ప్రభుత్వం ఎన్నికలను బీసీ రిజర్వేషన్లు ఖరారు చేశాక నిర్వహిస్తామని చెప్పడంతో కార్యదర్శులు పన్ను వసూలుపై దృష్టి పెట్టారు. దీంతో శుక్ర వారం మధ్యాహ్నం నాటికి జిల్లాలో 95 శాతం మేర పన్ను వసూలు అయినట్లు ఆన్‌లైన్‌లో నమోదైంది. 97 శాతం పన్ను వసూలుతో రాష్ట్రంలో మొదటి, రెండో స్థానాలలో జనగాం, రాజన్న సిరిసిల్ల జిల్లాలు ఉండగా, 95 శాతం పన్ను వసూలుతో మహబూబ్‌నగర్, నారాయ ణపేట, గద్వాల, జగిత్యాల, కామారెడ్డి జిల్లాలు మూడో స్థానంలో నిలిచాయి. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా పది రోజుల సమయం ఉంది. దాంతో 100 శాతం పన్ను వసూలు చేసేందుకు అధికారులు గ్రామాలలో విస్తృ తంగా పర్యటిస్తున్నారు.

423 గ్రామాలు

జిల్లాలో 16 మండలాలకు గాను 423 గ్రామాలు, 1,67,892 ఇళ్లు ఉన్నాయి. వాటి ద్వారా ఏటా రూ.6,95,21,977 పన్ను వసూలు కావాల్సి ఉంది. శుక్రవారం వరకు రూ. 6,58,98,198 వసూలు అయ్యింది. ఇంకా రూ.36,23,779 వసూలు చేయాల్సి ఉంది. మహబూబ్‌నగర్, మూసాపేట మండలాల్లో 100 శాతం పన్ను వసూలు కాగా, మిగిలిన మండలాల్లో 90 శాతానికిపైగా మాత్రమే వసూలైంది. వలస గ్రామాలైన ఉదం డాపూర్, వల్లూర్ గ్రామ పంచాయతీలు ట్యాక్స్ లెస్ గ్రామాలుగా ఉన్నాయి. ఈ గ్రామాలలో పన్ను మినహాయిస్తే పర్సెంటేజీ పెరిగే అవకా శాలు ఉన్నాయి.

100 శాతం వసూలు చేస్తాం



ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి జిల్లాలో పన్ను 100 శాతం వసూలు చేస్తాం. జనవరి చివరి వారంలో 33 శాతం ఉన్న పన్ను వసూలును ఫిబ్రవరి రెండో వారానికి 83 శాతానికి పెంచాం. అన్ని మండలాల ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పన్ను వసూ లుపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడంతో శుక్ర వారం నాటికి 95 శాతానికి చేరుకుంది. ఈ నెల చివరి నాటికి 100 శాతం పన్ను వసూలు లక్ష్యంగా అధికారులు పని చేస్తున్నారు.

- పార్థసారథి, డీపీవో

పది పరీక్షలు ప్రారంభం

- మహబూబ్‌నగర్ జిల్లాలో 60, నారాయణపేట జిల్లాలో 39 కేంద్రాల ఏర్పాటు
- పాలమూరులో 99.68 హాజరు శాతం నమోదు


మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాల కేంద్రం వద్ద నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


మహబూబ్‌నగర్‌లోని ఎల్లమ్మ గుడిలో పూజలు చేస్తున్న విద్యార్థినులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/నారాయణపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు శుక్ర వారం ప్రారంభమయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 60, నారాయణపేట జిల్లాలో 39 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్‌లో 99.68 హాజరు శాతం నమోదైంది. కేంద్రాల్లోకి విద్యార్థులను గంట ముం దే అనుమతించారు. ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు కొనసాగాయి. జిల్లా కేంద్రంలోని మహాత్మా గాంధీ రోడ్డు ఉన్నత పాఠ శాల, క్రీస్తు జ్యోతి విద్యాలయం, భూత్పూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, ప్రశ్నపత్రాల రికార్డులను పరిశీలించారు. కేంద్రాలకు విద్యుత్ నిరంతరం సరఫరా జరిగేలా చూడాలన్నారు. ఎండల దృష్ట్యా విద్యార్థులు అస్వస్థతకు గురైతే సేవలు అందించేందుకు ఓఆర్ఎస్, మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. కేంద్రా ల్లోకి ఎట్టి పరిస్థితుల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు అనుమతించ కూడదన్నారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఎల్‌వో ఐదు, డీఈవో 11 కేంద్రా లను పరిశీలించారు.

పాలమూరులో 12,744 మంది హాజరు

జిల్లా వ్యాప్తంగా 12,785 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 12,744 మంది విద్యార్థులు హాజరయ్యారు. 42 మంది గైర్హాజరు అయ్యారు. 99.68 హాజరు శాతం నమోదైంది. మొదటి రోజు కావ డంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రు లతో సందడి నెలకొంది. పాలమూ రులో విద్యార్థులు హాల్ టికెట్లు గుడిలో పెట్టి పూజలు చేయించారు. జిల్లా కేంద్రంలోని రేణుక ఎల్లమ్మదే వాలయం విద్యార్థులతో రద్దీగా మారింది.

నారాయణపేటలో 22 మంది గైర్హాజరు

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 7,631 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 7,613 మంది హాజర య్యారు. 22 మంది గైర్హాజరు అయ్యారు. రాష్ట్ర పరిశీలకులు దుర్గప్రసాద్, కలెక్టర్ సిక్తాపట్నాయక్, డీఈవో గోవిందరాజులు కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల వద్దకు విద్యార్థులు ఎనిమిదిన్నరకే చేరుకున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్ష సమయంలో ఇంటర్‌నెట్, జిరాక్స్ స్టేషనరీ దుకాణాలను మూసివేయించారు.


ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాల కేంద్రంలో విద్యార్థులు


మహబూబ్‌నగర్‌లోని మాడ్రన్ హైస్కూల్ కేంద్రం ముందు నెలకొన్న సందడి

కనిపించే అబద్ధం

జాతీయ రహదారిపై కనిపిస్తున్న ఎండమావులు



క్లిక్.. క్లిక్..


ఎర్రటి ఎండలో వర్షం పడిందేమో.. అందుకే రోడ్డుపై నీళ్లు నిలిచాయేమో అని మీరనుకుంటే పొరబడ్డట్లే. అవి నీళ్లు కావు. ఎండమావులు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్-పాలమూరు బైపాస్ రహదారిపై శనివారం కనిపించిన ఈ దృశ్యాలను చూసిన పలువురు బౌరా! అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

-ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మక్తల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని కర్ని శివారులో శుక్రవారం ఉదయం చోటుచేసుకున్నది. గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మక్తల్ మునిసిపాలిటీ పరిధిలోని చందాపూర్ గ్రామానికి చెందిన యువకుడు మహే ష్‌కుమార్(23) మండలంలోని కర్ని గ్రామ శివారులో కూలీగా వెళ్లి విద్యుత్ తీగలు సరిచేస్తున్నాడు. అదే సమయంలో విద్యు త్ సరఫరా కావడంతో విద్యుదాఘాతంతో స్తంభం పైనుంచి కింద పడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులు మక్తల్ విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు 3 గంటల పాటు ధర్నా నిర్వహించారు. డీఈ నర్సింగరావు, ఏడీ జగన్మో హన్, ఏఈ రామకృష్ణ ఘటనాస్థలానికి చేరుకొని బాధిత కుటుంబానికి రూ.8 లక్షల పరిహారం అందిస్తామని హామి ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఆందోళన కారణంగా మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలి చిపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

దంచికొడుతున్న ఎండలు

▸ జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలలో 39.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

మహబూబ్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. మధ్యాహ్నం వేళ్ల ప్రజలు రోడ్లపైకి రాలేని పరిస్థితి ఉన్నది. శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలలో 39.3 డిగ్రీలు, అలంపూర్‌లో 39.2 డిగ్రీలు, ధరూర్‌లో 39.1 డిగ్రీలు, గద్వాల, మల్దకల్ కేటీదొడ్డి, అయిజ లలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో గరిష్ఠంగా 38.4 డిగ్రీలు, కనిష్ఠంగా 24.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 37.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నారాయణపేట జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 36 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 25 డిగ్రీలు నమోదైంది. నాగర్‌కర్నూలు జిల్లాలో గరిష్ఠం 35, కనిష్ఠం 23 డిగ్రీలు నమోదైంది.



అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



పెద్దకొత్తపల్లి హై స్కూల్ క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం

పెద్దకొత్తపల్లి/ తెలకపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఆరుగురు విద్యార్థులు అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కల్వకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 18న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు, తెలకపల్లి మండలం లోని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు ప్రతిభ కనబరి చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిలో పెద్దకొత్తపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎం.లోకేశ్, టి.శేఖర్ (9వ తరగతి), జి.రామకృష్ణ, ఆర్.లోకేశ్ (8వ తరగతి), ఆలేరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.మధుప్రియ (6వ తరగతి), డి.రామ్‌చరణ్ (9వ తరగతి) ఉన్నారు. ఈ నెల 23వ తేదీన హైదరాబాద్‌లోని కొల్లూరు గాజీఎం స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, జి.నరహరి, పీడీలు బాలసుబ్రహ్మణ్యం, ఎ.బాలయ్య అభినందించారు. రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనబర్చి గెలుపొంది జాతీయ స్థాయికి ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు.

పేదల బియ్యం పెద్దల పాలు

● వందల క్వింటాళ్ల బియ్యం కర్ణాటక మిల్లులకు సరఫరా

● పట్టించుకోని అధికారులు



కృష్ణలో బియ్యం కోసం తిరుగుతున్న వ్యక్తులు

కృష్ణ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలు, పూట గడవని కటిక పేదలు, సామాన్య ప్రజల కోసం ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు చేసి రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు సరుకులు సరఫరా చేస్తోం ది. కడుపు నిండా భోజనం చేయాలనే సదుద్దేశంతో ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. అయితే ప్రభుత్వ సంకల్పానికి కొందరు తూట్లు పొడుస్తూ పం పిణీ చేసిన రేషన్ బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా కేంద్రంలోని రైస్‌మిల్లులకు వందల క్వింటాళ్లు తరలిస్తోంది. నెల వచ్చిం దంటే చాలు కృష్ణ మండల కేంద్రంతో పాటు, చేగుంట, గుడేబల్లూరు, హిందూపూర్, కున్సి, తంగడిగి, గురుజాల్, అయి నాపూర్, అలంపల్లి, ముడుమాల్, మురహర్ దొడ్డి తదితర గ్రా మాల్లో కొందరు బియ్యం కొనుగోలు చేయడం కోసం మహిళా కూలీలు, యువకులను రంగంలోకి దింపుతున్నారు. వారికి దిన సరి కూలి రూ.450 చెల్లిస్తు కరెంటు కాంటాలు, ఖాళీ బస్తాలతో పాటు, వారి చేతుల్లో డబ్బులు పెట్టి ఆటోలు, బైకుల ద్వారా సాయంత్రం వేళల్లో గ్రామాలకు పంపి రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ బియ్యం అమ్మేవారికి కిలో బియ్యం రూ.12 నుంచి రూ.15 వరకు కాం టాలు చేసి కొనుగోలు చేస్తున్నారు. కొన్న బియ్యాన్ని దాచి అర్థరాత్రి వేళల్లో గూడ్స్ ఆటోలో మక్తల్‌కు చేర్చి అక్కడినుంచి 167వ జాతీయ రహదారి చెక్‌పోస్టు మీదుగా కర్ణాటక రాష్ట్రం లోని రైస్‌మిల్లులకు తరలిస్తు లక్షల్లో సంపాదిస్తున్నారు. సంపాదించిన దాంట్లో మండలం లోని అధికారులకు నెలనెల మామూళ్లు అప్ప గించడంతో వారు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమ సరఫరా కాకుండా నిలుపుదల చేయా లని, గ్రామాలు తిరిగి కొనే వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



దుందుభీ వాగులో భారీ యంత్రాలతో ఇసుక లోడింగ్

దుందుభీ లూటీ

▸ మ్యానువల్ అనుమతులతో ఇసుక రవాణా

▸ భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి

▸ అనుమతి లేకున్నా యంత్రాలతో తోడివేత

▸ వందలాది ట్రాక్టర్లతో తరలిస్తున్న వ్యాపారులు

▸ ప్రభుత్వ పనులకు అనుమతిచ్చామంటున్న అధికారులు

ఉప్పునుంతల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దాపూర్, మొల్గర గ్రామాల సమీపంలోని దుందుభీ వాగులో ఇసుక తరలిపోతోంది. ప్రభుత్వ పనుల పేరుతో ఇసుకాసురులు రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక కొరతతో నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ అభివృద్ధి పనులను త్వతరగతిన పూర్తి చేయాలనే లక్ష్యంతో స్థానిక ఎమ్మెల్యే చొరవ, కలెక్టర్ ఆదేశాల మేరకు ఉప్పునుంతల తహసీల్దార్ ఇసుకకు అనుమతులు ఇస్తున్నారు. ప్రభుత్వ పథకాల పనుల ప్రొసీడింగ్ ఆధారంగా ఒక్కో రోజు 50 నుంచి 70 ట్రాక్టర్లకు రోజుకు రెండు ట్రిప్పుల చొప్పన ఒక్కో ట్రాక్టరుకు మూడు రోజులు ఇసుక రవాణా చేసే విధంగా తహసీల్దార్ అనుమతులు ఇస్తున్నారు. ఇదే అదునుగా భావించిన రెవెన్యూ అధికారులు ఒక్కో ట్రాక్టర్ వద్ద అనుమతుల కోసం ప్రతీ రోజు వెయ్యి రూపాయిలు వసూలు చేస్తున్నట్లు బహిరంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెల 18 నుంచి ఇసుక అనుమతులు కొనసాగుతున్నాయి. ప్రతీ రోజు దుందుబీ వాగు నుంచి అనుమతుల పేరుతో దాదాపు 200 ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తుండగా, అనుమతుల ముసుగులో మరో వంద ట్రాక్టర్ల వరకు ఇసుకను అక్రమంగా తరలించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా దుందుబీ వాగు పరిసర ప్రాంత రైతులు తమ యాసంగి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ రోజు లక్షల టన్నుల ఇసుక తరలిపోతే భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లలో నీటి మట్టం తగ్గి బోర్లు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇసుక తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరుతున్నారు.



దుందుభీ వాగులో ట్రాక్టర్లకు యంత్రాలతో లోడింగ్ చేయకూడదని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు (ఫైల్)



ప్రభుత్వం పనుల పేరుతో ఇసుక అనుమతులు ప్రైవేట్ వ్యక్తులకు అమ్మకాలు

కలెక్టర్ ఆదేశాల మేరకు ఇసుక అనుమతులు ఇస్తున్నాం

కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పనుల కోసమని ఇసుకకు అనుమతులు ఇస్తున్నాం. సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులతో పాటు మునిసిపాలిటీలో వివిధ ప్రభుత్వ పనులకు అనుమతులు ఇస్తున్నాం. దుందుభీ వాగులో మైనింగ్ శాఖ గుర్తించిన ఇసుక క్వారీలు ఏమీలేవు. పెద్దాపూర్, మొల్గర సమీపంలో ఇసుక ఉన్న చోట ఇసుక రవాణా చేస్తున్నారు. ఇసుక లోడింగ్ వద్ద పర్యవేక్షణ కోసం ముగ్గురు రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేశాం. వాగులో లోడింగ్‌కు యంత్రాలకు తాము అనుమతులు ఇవ్వలేదు. అది పోలీసు శాఖ చూసుకుంటుంది.

- ప్రమీల, తహసీల్దార్, ఉప్పునుంతల

ఎక్స్‌కవేటర్‌తో లోడింగ్ చేయకూడదు

దుందుభీ వాగులో ఇసుక అనుమతులు ఉన్న ట్రాక్టర్లకు కూలీలతో ఇసుక లోడింగ్ చేయాలి తప్ప, యంత్రాలతో లోడింగ్ చేయకూడదు. అలా చేస్తున్న విషయం నా దృషికి రాలేదు. విషయం తెలుసుకొని యంత్రాలతో లోడింగ్ చేయకుండా చూస్తా. ఇసుక అక్రమ రవాణా కట్టడికి ప్రతీ ఇసుక క్వారీ వద్ద రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేస్తాం.

- మాధవి, ఆర్డీవో, అచ్చంపేట

ఆర్మీ జవాన్ విగ్రహం ధ్వంసం

▸ దుండగులను శిక్షించాలని కుటుంబీకుల డిమాండ్



ధ్వంసమైన ఆర్మీ జవాన్ విగ్రహం

చారకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని బోడబండ తండాకు చెందిన ఆర్మీ జవాన్ మహిపాల్‌నాయక్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని జవాన్ కుటుంబ సభ్యులు లస్కర్‌నాయక్ శుక్రవారం కోరారు. దేశం కోసం 2004 సంవత్సరంలో ప్రాణాలర్పించిన ఆర్మీ జవాన్ మహిపాల్‌నాయక్ విగ్రహాన్ని 2005 ఏర్పాటు చేశామని తెలిపారు. గురువారం రాత్రి గుర్తు తెలయని దుండగులు విగ్రహంలోని ముక్కు భాగాన్ని ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు పాలప్పడిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కల్వకుర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నీటిని నల్గొండకు తరలించడాన్ని వ్యతిరేకిస్తూ కల్వకుర్తి పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో శనివారం ఉదయం 10గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ వెంకట్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా పాల మూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి హాజరవుతారని తెలిపారు. రైతులు ప్రజాసంఘాల నాయకులు అభ్యుదయ వాదులు, మేధావులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

డీలిమిటేషన్‌తో అన్యాయం

(5వ పేజీ తరువాయి)

చేపట్టాలని కేంద్రం భావిస్తుండగా, అదే విషయమై 'ఆంధ్రజ్యోతి' ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని మెజారిటీ ప్రజలు స్పష్టం చేశారు.

ఏంటీ వివాదం..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 81, 82 ప్రకారం పార్లమెంట్‌లోని ప్రతినిధుల సభ(లోక్‌సభ)లో జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ సీట్ల సంఖ్య ఉండాలి. అలాగే ఒక నియోజకవర్గానికి, మరో నియోజకవర్గానికి మధ్య జనాభాలో భారీ తేడాలు ఉండకూడదు. ప్రతీ దశాబ్దానికి ఒకసారి జనాభా లెక్కలు నిర్వహించిన తర్వాత ఒక డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసి, దాని ద్వారా జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచాలి. 1971 వరకు ఈ పునర్విభజన జరిగింది. ఆ సమయంలో దేశంలో జనాభా పెరుగుదలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక విధానం తీసుకుంది. ఆ నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు సమర్థవంతంగా పాటించగా.. ఉత్తరాది రాష్ట్రాలు సరిగా పాటించలేదు. ఉదాహరణకు తెలంగాణలో జననాల రేటు సగటున 16.4 ఉండగా.. అదే ఉత్తరప్రదేశ్‌లో 25.1గా ఉంది. అయితే జనాభా నియంత్రణను విధానంగా తీసుకున్న సమయంలోనే నియంత్రణను పాటించిన రాష్ట్రాలు డీలిమిటేషన్ వల్ల నష్టపోతాయని భావించిన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 25 సంవత్సరాల వరకు పునర్విభజన చేయవద్దని చట్టం చేశారు. 2001లో మళ్లీ పునర్విభజన ప్రస్తావన వచ్చినప్పటికీ.. అప్పటి ప్రధాని వాజ్‌పేయి 84వ రాజ్యాంగ సవరణ ద్వారా మరో 25 ఏళ్ల పాటు తటస్థంగా ఉండాలని చట్టం చేశారు. అంటే 2026లో నియోజకవర్గాల పునర్విభజన చేయాల్సి ఉంది. అయితే 2021లో జరగాల్సిన జనాభా లెక్కలు ఇప్పటివరకు జరుగలేదు. ఒకవేళ కేంద్రం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేయాలంటే 1971 లెక్కలనే ప్రామాణికంగా తీసుకుంటే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగదని ఇక్కడి పార్టీలు చెబుతున్నాయి. లేకపోతే జనాభా నియంత్రణలో విఫలమైన రాష్ట్రాల చేతిలోకి పవర్ వెళ్లి.. తమ ప్రాతినిధ్యం తక్కువవుతుందనేది అంటున్నాయి. అందుకే జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయి.

అన్యాయమే అంటున్న ప్రజలు..

ఇదే అంశంపై 'ఆంధ్రజ్యోతి' నాలుగు ప్రశ్నలతో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో సర్వే చేసింది. నియోజకవర్గానికి 200 శాంపిళ్లతో సర్వే చేయగా, మెజారిటీ ప్రజలు జనాభా ప్రాతిపదికన డీ లిమిటేషన్ సరికాదనే చెప్పారు. ఇప్పటికే పన్నులు కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాల నుంచే ఎక్కువగా వెళ్తున్నాయి. జనాభా ప్రాతిపదికన కేంద్రం నిధులు కేటాయిస్తుండటంతో ఎక్కువ పన్నులు కట్టిన రాష్ట్రాలకు తక్కువ నిధులు వస్తున్నాయని, తక్కువ పన్నులు కట్టిన రాష్ట్రాలకు ఎక్కువ నిధులు వెళ్తున్నాయనే ఆందోళనను పలువురు మేధావులు వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం అనేది రాష్ట్రాల సమాఖ్య అని.. కానీ సమాఖ్య పద్ధతిలో పాటించాల్సిన నియమాలను కేంద్రంలోని పెద్దలు పాటించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కేంద్రం నుంచి వచ్చే నిధుల్లో వివక్ష ఎదుర్కొంటుండగా, భవిష్యత్‌లో జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే అధికారం కూడా ఉత్తరాది చేతుల్లో కేంద్రీకృతమై ఉంటుందని, దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో 80 పార్లమెంట్ సీట్లు ఉండగా, అవి 48 పెరిగి.. 128కి చేరుతాయి. బీహార్‌లో 30, మధ్యప్రదేశ్‌లో 18, మహారాష్ట్రలో 20, రాజస్థాన్‌లో 19 పెరుగతాయి. అదే దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణలో మూడు, ఆంధ్రప్రదేశ్‌లో మూడు, తమిళనాడులో రెండు మాత్రమే పెరుగుతాయి. బీలో బర్త్ రేట్ ఉన్న కేరళలో ప్రస్తుతం ఉన్న 20 స్థానాల్లో ఒకటి తగ్గి 19కి చేరుతాయి.

యాచకురాలిపై లైంగిక దాడి?

గద్వాల క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ జిల్లా కేంద్రంలో భిక్షాటన చేసే ఓ మహిళపై కొందరు వ్యక్తులు అత్యాచారం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ఓ ప్రాంతంలో ఓ మహిళ భిక్షాటన చేసుకొని తింటూ అక్కడే నివసించేది. అయితే ప్రతీ రోజు అందరితో మాట్లాడే మహిళ శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే చలనం లేకుండా పడుకొని ఉన్నది. కొందరు స్థానికులు ఆ మహిళ దగ్గరకు వచ్చి ఆరా తీయగా కొందరు వ్యక్తులు తనపై దాడి చేశారని, రక్తస్రావం అవుతుందని కూడా చెప్పడంతో అత్యాచారం జరిగి ఉండవచ్చని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్, రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకొని బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ విషయంపై పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఆసుపత్రికి తరలిస్తున్నామని, పరీక్షల అనంతరం వివరాలు నిర్ధారించగలమని తెలిపారు.

నల్లమల అటవీ ప్రాంతంలో మంటలు



నల్లమలలోని బుడ్డారిపెంట ప్రాంతంలో చెలరేగిన మంటలు

▸ విప్పపూత సేకరణ కోసం అడవికి నిప్పు పెట్టడంతో అగ్గి

▸ కఠిన చర్యలు: దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్

▸ పది హెక్టార్ల విస్తీర్ణం మేర అడవి దగ్ధం

దోమలపెంట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో మరోసారి మంటలు చెలరేగాయి. అమ్రాబాద్ అభయారణ్యం దోమలపెంట రేంజ్ పరిధిలోని ఈగలపెంట సెక్షన్‌లో కంపార్ట్‌మెంట్ 265, 281లో రెండు రోజులుగా మంటలు చెలరేగుతున్నాయి. శుక్రవారం ఇదే సెక్షన్‌లోని బీట్ అక్కమా బెలం, బుడ్డారిపెంట ప్రాంతంలో మంటలు చెలరేగి సుమారు 10 హెక్టార్లకు పైగా అటవీ ప్రాంతం దగ్ధమయిందని దోమల పెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్ చెప్పారు. రెండు అగ్నిమాపక బృందాలు, మరికొందరు బేస్ క్యాంపు వాచర్లు 8 గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఎండల తీవ్రత అధికంగా ఉంటున్న నేపథ్యంలో గడ్డి ఎక్కువగా ఎండటం వలన మంటలు చెలరేగితే అదుపులోకి తెచ్చేందుకు ఎక్కవ సమయం పడుతుందన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో వేసవిలో విప్పపూత దొరుకుతున్నందున దాని సేకరణ కోసం అడవికి వెళ్లేవారు ఉద్దేశపూర్వకంగా మంటలు పెడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రుణాల పేరుతో మోసం

▸ రైతుల నుంచి లక్షల రూపాయల వసూలు

▸ నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగింత



నకిలీ బ్యాంకు ఉద్యోగికి సంబంధించి నకిలీ స్టాంపులు, నకిలీ ఐడెంటిటీ కార్డు



రుణాలు మంజూరు అయ్యాయని నకిలీ స్టాంపులతో తయారు చేసిన డాక్యుమెంట్

గద్వాల క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తాను ఓ ప్రైవేటు బ్యాంకు ఉద్యోగినని, పొలాలకు రుణాలు ఇప్పిస్తామని డబ్బు వసూలు చేసి మోసం చేసిన ఓ వ్యక్తిని రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. బాధితులు, బ్యాంకు అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల మండలంలోని పూడూరు గ్రామానికి చెందిన ప్రసాద్ అలియాస్ గిరిప్రసాద్ అనే వ్యక్తి ఐఐఎఫ్ఎల్ బ్యాంకు ఉద్యోగిని అని చెప్పి 14 నెలల క్రితం గట్టు మండలానికి చెందిన రైతు బలరామ్‌నాయుడును నమ్మించాడు. అతడికి సంబంధించిన 10 ఎకరాల పొలానికి కోటి రూపాయల రుణం ఇప్పిస్తానని చెప్పి రూ.3 లక్షలు తీసుకున్నాడు. అలాగే గట్టు మండలానికి చెందిన గోవిందుకు రూ. 35 లక్షల రుణం ఇప్పిస్తామని లక్ష, రాజుకు రూ.35 లక్షలు ఇప్పిస్తానని మరో లక్ష తీసుకున్నాడు. చెనుగోనిపల్లికి చెందిన సర్వేశ్వర్‌రెడ్డికి రూ. 45 లక్షలు అప్పు ఇప్పిస్తానని రూ. 32,350, ఇలా గట్టు మండలానికి చెందిన 12 మంది రైతుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేశాడు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుతో పాటు కర్ణాటకకు చెందిన రైతుల నుంచి కూడా డబ్బులు తీసుకున్నాడు. ఆ తర్వాత కొద్ది రోజులకు రుణాలు మంజూరయ్యాయని చెప్పి నకిలీ డాక్యుమెంట్లు ఇచ్చాడు. వారు బ్యాంకుకు వెళ్లగా, అవి నకిలీవి అని, అతడు మా ఉద్యోగి కాదని చెప్పడంతో రైతులు కంగుతిన్నారు. అలాగే కర్నూలులోని ఓ జిరాక్స్ సెంటర్‌లో కొద్దిరోజుల క్రితం నకిలీ స్టాంపులు, డాక్యుమెంట్లు తయారు చేస్తుండగా కర్నూల్‌కు చెందిన ఆ బ్యాంకు మేనేజర్ రాఘవేంద్ర పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేయించాడు. అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతున్న నిందితుడు ప్రసాద్‌ను బాధితుడు బలరాంనాయుడు పట్టుకొని పట్టణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించి, ఫిర్యాదు చేశారు. వారితో పాటు గద్వాల, కర్నూల్‌కు చెందిన బ్యాంకు ఉద్యోగులు కూడా ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ మాట్లాడుతూ విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు.

మార్ట్‌లో కుళ్లిన ఆహార పదార్థాలు

▸ ఫిర్యాదు చేసిన కొనుగోలుదారుడు

▸ ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



మార్ట్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు



ఫంగస్‌తో కుళ్లిన ఆహార పదార్థాలు

వనపర్తి టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలో ఒక ప్రధాన సంస్థకు చెందిన మార్ట్‌లో కుళ్లిన ఆహారపదార్థాలు ఉన్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. మార్ట్‌లో ఆహారపదార్థాలు కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లిన వినియోగదారుడు అవి ఫంగస్‌తో కుళ్లిపోయినట్లు గుర్తించాడు. వెంటనే మార్ట్‌కు వచ్చి ఆ పదార్థాలను వెనక్కి తీసుకోవాలని కోరగా, మేనేజర్ నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. దీంతో అతడు ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఫుడ్‌సేఫ్టీ అధికారి నీలిమ, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పబ్లిక్ హెల్త్ అధికారి డాక్టర్ రామచంద్రారావు, మునిసిపల్ హెల్త్ అసిస్టెంట్ శివలు శుక్రవారం మార్ట్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాలకు ఫంగస్ వచ్చినట్లు గుర్తించి, నమూనాలు సేకరించారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేస్తామని, అనంతరం ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ముందుకెళ్తామని వారు తెలిపారు. అనంతరం మార్ట్‌ను తాత్కాలికంగా మూసివేశారు.

బిర్యానీలో బొద్దింక



జడ్చర్లలోని హోటల్‌లో బిర్యానీలో వచ్చిన బొద్దింక

జడ్చర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : హోటల్ బిర్యాని తిందామని వెళ్లగా అందులో బొద్దింక వచ్చింది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని కొత్తబస్టాండు సమీపంలో గల ఓ ప్రముఖ హోటల్‌లో చోటు చేసుకుంది. నాగర్‌కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న శరత్‌రెడ్డి, జడ్చర్లలోని ఓ హోటల్‌లో శుక్రవారం మధ్యాహ్నం భోజనానికి వెళ్లాడు. మటన్ బిర్యానీ ఆర్డర్ చేశాడు. బిర్యాని తింటుండగా బొద్దింక కనిపించింది. వెంటనే హోటల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అందుబాటులో లేని కారణంగా రాలేకపోయారు. అదే హోటల్‌లో మరో వ్యక్తి ఆర్డర్ చేసిన చికెన్ బిర్యానీలో తాడు రావడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. కాగా హోటల్‌కు భోజనానికి వచ్చిన వినియోగదారులు అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హోటల్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రైం కార్నర్

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

» నారాయణపేట డీఎస్పీ లింగయ్య



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, నారాయణపేట మండలం రెడ్యానాయక్ తండాకు చెందిన శారు రాథోడ్ (20) హత్య కేసులో నిందితుడైన ఆమె భర్త వినోద్‌నాయక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ లింగయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్ గోపితండాకు చెందిన శారు రాథోడ్ (20)కు, రెడ్యానాయక్ తండాకు చెందిన వినోద్‌నాయక్‌తో ఈ ఏడాది జనవరి 21 న వివాహం అయ్యింది. కానీ వేరే యువతిని పెళ్లి చేసుకోవాలనే ఆలోచనతో ఉన్న వినోద్ నాయక్ ఈ నెల 19న రాత్రి ఆమెతో గొడవ పెట్టుకొని కొట్టాడు. ఎందుకు కొడుతున్నావని తల్లిదండ్రులు అతడిని నిలదీయడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రాత్రి పది గంటల సమయంలో తిరిగి వచ్చి భార్య గొంతు నులిమి చంపేశాడు. నేరం తన మీదకు రాకుండా చీరతో ఉరి వేసుకుందని, ఏదో పురుగుల మందు తాగిందని నమ్మించేందుకు యత్నించాడు. అది కుదరక పోవడంతో అక్కడి నుంచి పారిపోయాడు. పోలీసులకు ఫిర్యాదు అందడంతో శుక్రవారం నారాయణపేట బారంబావి దగ్గర నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించుకొని చీరను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ అధికారి మరికల్ సీఐ రాజేందర్‌రెడ్డి, నారాయణపేట ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

భర్తను చంపిన భార్య

నర్వ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : భర్తను భార్య గొంతు నులిమి చంపేసింది. ఈ దారుణ ఘటన నారాయణపేట జిల్లా, నర్వ మండలంలోని లంకాల గ్రామంలో శుక్రవారం జరిగింది. మృతుడి అక్కా బావలు దుప్పల్లి పద్మమ్మ, దుప్పల్లి నర్సింహులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లంకాల గ్రామానికి చెందిన పాలెం అంజన్నకు, మక్తల్ మండలం కర్నె గ్రామానికి చెందిన రంగమ్మతో 17 సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. అంజన్న ప్రస్తుతం నారాయణపేట జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి ఐటీఐ కళాశాలలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల తన భూమిని దాయాదులకు పట్టా చేసి ఇవ్వడంతో రూ.60 వేలు వచ్చాయి. ఆ డబ్బు కోసం భార్య రంగమ్మ తరుచూ గొడవ పడుతూ ఉండేది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి నిద్రలో ఉన్న అంజన్న గొంతుకు తాడు బిగించి చంపేసింది. ఈ మేరకు అక్కా బావలు పద్మమ్మ, నర్సింహులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్ఐ కుర్మయ్యను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

వెల్దండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల పరిధిలోని రాగాయిపల్లి సమీపంలో ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దాదాపు 55 నుంచి 60 ఏళ్ల వయసున్న మహిళ వంకాయ రంగు నైటీ ధరించినట్లు వారు తెలిపారు. మతిస్థిమితం సరిగా లేని ఆమె భిక్షాటన చేస్తూ జీవనం గడుపుతున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఎవరికైనా సమాచారం తెకలిస్తే తమను సంప్రదించాలని పోలీసులు కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని కేసరి సముద్రంలో గుర్తు తెలియని వ్యక్తి (45) మృతదేహం లభించినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెరువులో తేలిన మృతదేహాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని, మృతదేహాన్ని వెలికి తీసి నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై గోధుమ రంగు అంగి, ఖాకీ, నీలి రంగు లుంగీ ఉన్నట్లు గుర్తించారు. ఎవరికైనా అనుమానం ఉంటే మార్చురీలోని మృతదేహాన్ని పరిశీలించాలని సూచించారు. సంఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వివాహిత అదృశ్యం అయ్యింది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని క్రిస్టియన్‌పల్లి కాలనీకి చెందిన యాస్మిన్‌బేగం శుక్రవారం తెల్లవారుజామున ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. పిల్లలు లేచి చుట్టు పక్కల వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో అచ్చంపేటలో ఉండే తాత మహమ్మద్ ములాన్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే జిల్లా కేంద్రానికి చేరుకొని బంధువులు, చుట్టు పక్కల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాస్మిన్‌బేగం భర్త మహమ్మద్ మస్తాన్ జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాన్స్‌జెండర్ హత్యపై నిరసన

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లిలో ట్రాన్స్‌జెండర్ హత్యను నిరసిస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ట్రాన్స్‌జెండర్లు ఆందోళన చేపట్టారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ట్రాన్స్‌జెండర్ దీపిక చిత్ర పటానికి నివాళి అర్పించారు. నిందితుడి చిత్రపటాన్ని చెప్పులతో కొడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ దీపికను బన్నీ అనే యువకుడు ప్రేమ పేరుతో మోసం చేయడమే కాకుండా, కిరాతకంగా చంపాడని పేర్కొన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, మరోమారు ఇలాంటి సంఘటనలు జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రాన్స్‌జెండర్లకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ట్రాన్స్‌జెండర్లు రాములమ్మ, నిషా తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

మహబూబ్‌నగర్, మార్చి, 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ - మన్యంకొండ రైల్వే స్టేషన్ల మధ్య, మోనప్పగుట్ట సమీపంలో శుక్రవారం సాయంత్రం 7:30 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని మహిళ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నది. ఆమె మృతదేహం రెండు భాగాలుగా విడిపోయింది. ఆ మహిళ ఒంటిపై చిలకపచ్చరంగు చీర, ఎరుపు రంగు జాకెట్ ఉంది. గుండ్రటి ముఖము, ఎత్తుపళ్లు ఉన్నాయని రైల్వే పోలీసులు వెల్లడించారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కస్టమ్ మిల్లింగ్ రైస్ మాయం

పాన్‌గల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండల కేంద్రంలోని ఎస్‌వీఎస్ఎస్ రైస్ మిల్లు నుంచి కస్టమ్ మిల్లింగ్ రైస్ మాయం అయ్యింది. దీనికి సంబంధించి మిల్లు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. యాసంగి, వానకాలం సీజన్‌లలో ఆ మిల్లుకు కేటాయించిన దానిలో 2712.376 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైందని తెలిపారు. ధాన్యం విలువ రూ.8.85 కోట్లు ఉంటుందన్నారు. ధాన్యం మాయంపై పౌర సరఫరాల సంస్థ అసిస్టెంట్ మేనేజర్ ధరావత్ బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరిన దామరగిద్ద మండలం, కానుకుర్తి శివ భక్తులు

శంకరా.. సదాశివా.. చంద్ర శేఖరా!

» దారి పొడవునా పరమ శివుడి నామస్మరణ
» శ్రీశైలానికి కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు
» 350 - 400 కిలోమీటర్ల పాదయాత్ర
» ఉగాది రోజు మల్లికార్జునుడు, భ్రమరాంబల దర్శనం
» అమ్మవారికి చీర, సారె సమర్పణ



శాంతినగర్ మీదుగా శ్రీశైలానికి కాలినడకన వెళ్తున్న కర్ణాటక భక్తులు

వడ్డేపల్లి/ గట్టు/ అయిజ/ అలంపూర్/ దామరగిద్ద, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్రగా తరలివెళ్తున్నారు. అలాగే నారాయణపేట జిల్లా, దామరగిద్దకు చెందిన భక్తులు కూడా శుక్రవారం శ్రీశైలానికి పాదయాత్రగా తరలివెళ్లారు. అంతకు ముందు కానుకుర్తి శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది నాటికి వారు శ్రీశైలానికి చేరుకొని బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటామని వారు తెలిపారు. దారిపొడవునా శివనామస్మరణ చేస్తూ ఉగాది పండుగ నాటికి శ్రీశైలం చేరనున్నారు. మల్లికార్జున స్వామి, భ్రమరాంబాదేవిలను దర్శించుకుంటారు. అమ్మ వారిని వారు తమ ఆడపడుచుగా భావిస్తారు. ఉగాది పర్వదినం రోజు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి, పుట్టినింటికి రమ్మని ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. అందుకో సంపంద్లు, ఫలహారాలు, పూలు, పట్టు వస్త్రాలతో పాటు పూజా సామగ్రిని దట్టీల్లో నింపుతారు. వాటిని అలంకరించిన పల్లకిలో ఉంచుకొని భుజాలపై మోసుకొని వెళ్తారు. ముందుగా పాతాళగంగలో పుణ్య స్నానాలు చేసి స్వామిని దర్శించుకుంటారు. అనంతరం అమ్మవారి ఆలయంలో ఒడి బియ్యం సమర్పిస్తారు.

పది రోజుల క్రితమే..

కర్ణాటక రాష్ట్రం, రాయచూరు, గుల్బర్గా, మహారాష్ట్రలకు చెందిన భక్తులు 10 రోజుల క్రితమే వారి స్వస్థలాల నుంచి శ్రీశైలానికి పాదయాత్రను ప్రారంభించారు. మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా, శివనామస్మరణ చేస్తూ యాత్రను కొనసాగిస్తున్నారు. మూడు రాష్ట్రాల మీదుగా వారి యాత్ర కొనసాగుతోంది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని శాంతినగర్ మీదుగా కాలినడకన వెళ్తున్న భక్తులను శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. పూర్వం తమ పెద్దలు కర్ణాటక ప్రాంతం నుంచి గుర్రాలపై శ్రీశైలం క్షేత్రానికి వెళ్లేవారని తెలిపారు. అదే విధంగా ప్రతీ సంవత్సరం తాము పాదయాత్రను కొనసాగిస్తున్నామని తెలిపారు.

ప్రతీ రోజు 40 కిలోమీటర్లు

ప్రతీరోజు తెల్లవారుజామున నాలుగు గంటలకు పాదయాత్ర ప్రారంభిస్తామని చెప్పారు. మధ్యాహ్నం 12 గంటల వరకు నడచి, మధ్యాహ్న భోజనం చేసి, విశ్రాంతి తీసుకొని తిరిగి సాయంత్రం నాలుగు గంటల నుంచి 10 గంటల వరకు నడక సాగిస్తామని తెలిపారు. ప్రతీ రోజు సరాసరి 40 కిలోమీటర్ల దూరం నడుస్తామని చెప్పారు. తమ వెంట ఒక వాహనంలో భోజనానికి అవసరమైన సామగ్రిని తీసుకెళ్తున్నామని తెలిపారు. దారి పొడువునా ఉన్న కొన్ని దేవాలయాల వద్ద స్థానికులు, దాతలు అన్నదానం చేస్తున్నారని తెలిపారు.

జోగుళాంబ సన్నిధిలో నిద్ర

శ్రీశైలానికి నాలుగు ప్రవేశద్వారాలు ఉన్నాయని దక్షిణాన సిద్ధవటం, ఉత్తరాన ఉమామహేశ్వరం, తూర్పున త్రిపురాంతకం, పడమరన అలంపురం క్షేత్రాలు ఉన్నాయని తెలిపారు. తాము అలంపురంలోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి సన్నిధిలో ఒక రాత్రి నిద్ర చేసి, అమ్మవారి అనుగ్రహం పొంది పాదయాత్ర సాగిస్తున్నామని వివరించారు. కాశీలోని గంగానదిలో స్నానం ఎంత పవిత్రమో, దక్షిణకాశీ అలంపురంలో నిద్ర చేస్తే అంతే పుణ్యం కలుగుతుందని తమ విశ్వాసం అన్నారు. దారిలో ఏ ఆపద కలుగకుండా మల్లన్న స్వామే తమను కాపాడుతాడని చెప్పారు. ఉగాది నాడు శ్రీశైలానికి చేరుకొని స్వామి, అమ్మవార్ల దర్శించుకొని పూజలు చేస్తామని, అనంతరం స్వగ్రామాలకు చేరుకుంటామని చెప్పారు. ఊరికి వచ్చాక, కొత్తకుండలో పరమాన్నం వండి బంధువులకు, స్నేహితులకు ప్రసాదంగా పంచుతామని తెలిపారు.

ఎలాంటి అలుపూ ఉండదు



కర్ణాటక ప్రాంతంలోని బీజాపూర్, గుల్బర్గ, యాదగిరి, శాషాపూర్, హోస్పేట్, రాయచూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు కాలినడకన శ్రీశైలం క్షేత్రానికి వెళ్తుంటారు. భ్రమరాంబ, మల్లికార్జున స్వాములను స్మరిస్తూ వెళ్తుంటే, అడుగులు అవే ముందుకు సాగుతాయి. దాదాపు 450 కిలోమీటర్లు సునాయాసంగా నడక సాగించినా అలసట తెలియదు. నేను 13 సంవత్సరాల నుంచి పాదయాత్ర చేస్తున్నాను.

- జోళాయప్ప, గుల్బర్గ, కర్ణాటక

ఎండ ఏమీ చేయదు



నేను ప్రతీ సంవత్సరం క్రమం తప్పకుండా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్నాను. 15 సంవత్సరాల నుంచి యాత్ర చేస్తున్నాను. ఇప్పటివరకు దారిలో ఎలాంటి అనారోగ్యానికి గురి కాలేదు. అమ్మవారిని తలచుకొంటే ఎండ, చలి ఏమీ చేయవు. మనసులో దైవచింతన ఉంటే ఎంత దూరమైనా సునాయాసంగా ప్రయాణం సాగించవచ్చని నా నమ్మకం.

- రాజేశ్వరి, ఎగనూర్

పాదయాత్రికులకు అన్నదానం

కర్ణాటక నుంచి శ్రీశైలం మల్లిఖార్జున స్వామి దర్శనానికి కాలినడకన వెళ్తున్న బక్తులకు జోగుళాంబ గద్వాల జిల్లా, బల్గెరలోని దిగంబర స్వామి ఆలయం దగ్గర అన్నదాన శిబిరం ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతునాయుడు శుక్రవారం పూజలు నిర్వహించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన తెలిపారు.



బల్గెరలో దిగంబర స్వామీ ఆలయం దగ్గర భక్తులకు అన్నదానం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు హన్మంతునాయుడు

భక్తుల కోసం ఉచిత వైద్యశిబిరం

శ్రీశైలం క్షేత్రానికి కాలినడకన వెళ్తున్న భక్తుల కోసం జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండల పరిధిలోని వెంకటాపూర్ స్టేజీ వద్ద వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. శిబిరంలో ప్రభుత్వ వైద్యాధికారి విష్ణు ఆధ్వర్యంలో అవసరమైన భక్తులకు వైద్య సేవలు అందిస్తున్నారు. కర్ణాటక, మహారాష్ట్రల నుంచి శ్రీశైలానికి పాదయాత్ర చేస్తున్న భక్తులు అయిజ, పర్దిపూర్, వెంకటాపూర్ గ్రామాల మీదుగా వెళుతున్నారు. అస్వస్థతకు గురైన భక్తులకు సత్వర వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వైద్యాధికారి తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందిస్తున్నామన్నారు. ఎండ తీవ్రం అయిన తర్వాత వీలైనంత వరకు పాదయాత్ర చేయొద్దని, నీరు అధికంగా తాగాలని భక్తులకు సూచించారు.



వెంకటాపూర్ గ్రామస్టేజీ వద్ద ప్రభుత్వ వైద్యాధికారి విష్ణు ఆధ్వర్యంలో భక్తులకు వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

సంగమేశ్వరాలయంలో పారిశుధ్య పనులు



సంగమేశ్వరం ఆలయం పరిసరాల్లో కొనసాగుతున్న పరిశుభ్రత పనులు

కొల్లాపూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది నుంచి పూర్తిగా బయటకు వచ్చిన సంగమేశ్వరాలయంతో పాటు, పరిసరాలను శుక్రవారం శుభ్రం చేశారు. దాదాపు ఎనిమిది నెలల పది రోజుల అనంతరం గురువారం పూర్తిగా బయటపడింది. ప్రాంగణంలో పేరుకుపోయిన బురదను తొలగించే ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. గర్భాలయంలో బురదను పూర్తిగా తొలగించిన అనంతరం భక్తుల స్వామి దర్శనానికి అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు అర్చకుడు తెలకపల్లి రఘురామయ్య శర్మ తెలిపారు. ఆలయంలోని వేపదారు శివలింగాన్ని భక్తులు దర్శించుకునేందుకు వీలుగా ఆలయానికి వెళ్లే దారిని శుభ్రం చేశారు. సోమశిల నుంచి నదిలో బోటులో ప్రయాణించి సంగమేశ్వరుడిని దర్శించుకోవచ్చు.

ఇరువర్గాల ఫిర్యాదులపై విచారణ



అమరచింత మునిసిపల్ కార్యాలయం వద్ద విచారిస్తున్న డీఎస్పీ

అమరచింత, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, అమరచింత మునిసిపల్ కమిషనర్, సీపీఎం నాయకులు పరస్పరం చేసుకున్న ఫిర్యాదులపై డీఎస్పీ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. అమరచింత మునిసిపల్ కార్యాలయంలో ఈ నెల 18న మునిసిపల్ కమిషనర్ రవిబాబు, మాజీ వైస్ చైర్మన్, సీపీఎం అమరచింత, ఆత్మకూరు మండల కార్యదర్శులు జీఎస్ గోపి, రాజుల మధ్య వాగ్వాదం జరిగింది. అదే రోజు మునిసిపల్ కమిషనర్ రవిబాబు తనను కులం పేరుతో దూషించాడని ఆరోపిస్తూ మునిసిపల్ వైఎస్ చైర్మన్ జీఎస్ గోపిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే సీపీఎం నాయకుడు రాజు తనను కులం పేరుతో దూషించారని, తోసి వేశారని ఆరోపిస్తూ మునిసిపల్ కమిషనర్‌తో పాటు మేనేజర్, వార్డు అధికారిపై ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శివకుమార్, ఎస్ఐ సురేశ్‌లు ఇరువురి ఫిర్యాదుల మేరకు సాక్షులను వేర్వేరుగా స్టేషన్‌కు పిలిచి విచారణ చేపట్టి, వారి వాంగ్మూలాలు నమోదు చేశారు. అనంతరం మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరేటర్‌లతో మాట్లాడి సంఘటన పూర్వాపరాలను తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ పరస్పరం చేసుకున్న ఫిర్యాదు లపై విచారించినట్లు తెలిపారు.

కొవిడ్ 'జనతా కర్ఫ్యూ'కు ఐదేళ్లు

» దేశ వ్యాప్తంగా 2020, మార్చి 22న బ్లాక్ డే
» గద్వాల జిల్లాలో 19,627 మంది బాధితులు
» కరోనాతో 257 మంది మృత్యువాత
» 44,641 మందికి వాక్సిన్ బూస్టర్ డోస్



వ్యాక్సిన్ వేయించుకుంటున్న విద్యార్థినులు (ఫైల్)

గద్వాల క్రైం, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : కరోనా మహమ్మారి విస్తృతంగా వ్యాప్తి చెందుతుండటంతో 2020, మార్చి 22న కేంద్ర ప్రభుత్వం మార్చి 22న జనతా కర్ఫ్యూ నిర్వహించింది. ఆ రోజు నుంచి రాష్ట్రంలో కొన్ని నెలల పాటు లాక్ డౌన్ విధించిన కేంద్ర ప్రభుత్వం కరోనా కట్టడికి పలు చర్యలు తీసుకున్నది. అయినా కరోనా వ్యాప్తి కొనసాగింది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం జోగుళాంబ గద్వాల జిల్లాలో కరోనా ఫస్ట్ వేవ్ సమయంలో 1,25,789 మందికి పరీక్షలు నిర్వహించగా, 6,076 మందికి నిర్ధారణ అయ్యింది. 2021 రెండ వ వేవ్ సమయంలో 4,84,363 మందికి పరీక్షలు నిర్వహించగా, 11,788 మందికి పాజి టివ్ వచ్చింది. మూడవ వేవ్‌లో 2,02,752 మందికి పరీక్షలు నిర్వహించగా 1,763 మందికి కరోనా సోకినట్లు వెల్లడైంది. మొత్తం మూడు వేవ్‌లలో 8,12,904 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 19,627 మంది కరోనా బారిన పడ్డారు. జిల్లా వ్యాప్తంగా కరోనాబారిన పడిన వారిలో 257 మంది మృత్యువాత పడినట్లు అధికారులు చెప్తున్నారు. అయితే జిల్లాకు చెందిన పలు వురు బాధితులు హైదరాబాద్, కర్నూల్ తదితర ప్రాంతాల్లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం.



అప్పటి జిల్లా కలెక్టర్ సమక్షంలో వ్యాక్సిన్ వేసుకుంటున్న వృద్ధుడు(ఫైల్)

విస్తృతంగా వ్యాక్సినేషన్

జోగుళాంబ గద్వాల జిల్లాలో 18 సంవత్సరాలు పైబడిన వారు 4,60,075 మంది ఉండగా, మొదటి విడతలో 4,62,195 మందికి, రెండవ విడతలో 4,75,117 మందికి వ్యాక్సిన్ వేసినట్లు అధికారులు తెలిపారు. 15 నుంచి 17 సంవత్సరాల వారు 32,671 మందికి గాను, మొదటి విడతలో 32,620, రెండవ విడతలో 32,221 మందికి వ్యాక్సినేషన్ చేశారు. 12 నుంచి 14 సంవత్సరాల వారు 20,160 మంది లక్ష్యం కాగా, మొదటి విడతలో 21,206, రెండవ విడతలో 20,494 మందికి వ్యాక్సిన్ వేశారు. అలాగే హెల్త్‌కేర్ సిబ్బంది 2,317 మందికి గాను 2,347 మందికి వ్యాక్సిన్ వేశారు. ఫ్రంట్‌లైన్ వర్కర్లు 2,997 మందికి గాను 3,174 మందికి వ్యాక్సిన్ వేసి లక్ష్యాన్ని పూర్తి చేశారు. అలాగే 60 సంవత్సరాల పైబడిన వారు 59,267 మంది ఉండగా, 44,641 మంది బూస్టర్ డోస్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు వారు 4,07,238 మంది లక్ష్యం కాగా, 2,71,896 మంది వాక్సినేషన్ చేయించుకున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

మాస్కులు ధరించడం మంచిదే..



కరోనా మహమ్మారి ఎంతో మంది ప్రాణాలను హరించింది. ప్రతీ ఒక్కరు ఆరోగ్య పరమైన జాగ్రత్తలను పాటించాలి. ఇప్పుడు కూడా ప్రతీ ఒక్కరూ సామాజిక దూరం పాటించడంతో పాటు మాస్కులను దరిస్తూ, శానిటైజర్‌ను ఉపయోగించుకోవాలి. దగ్గు, జలుబు విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అవసరం అయినప్పుడు వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ సిద్ధప్ప, డీఎంహెచ్‌వో

బంగారం, వెండి చోరీ

» కల్వకుర్తిలో ఘటన



పరిశీలిస్తున్న ఎస్ఐ మాధవరెడ్డి

కల్వకుర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని తిలక్‌నగర్‌లోని ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. తిలక్‌నగర్‌కు చెందిన శ్రీను గురువారం కుటుంబసభ్యులతో కలిసి బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లారు. శుక్రవారం ఇంటికి వచ్చే సరికి తలుపులు తీసి ఉన్నాయి. లోపలికి వెళ్లి చడగా బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న మూడు తులాల బంగారం, 40 తులాల వెండిని గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

పేదలందరికీ సంక్షేమ పథకాలు

నవాబ్‌పేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తహసీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నీరటి రాంచంద్రయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. బంగ్లరవి, నవాజ్‌రెడ్డి, కోట్ల రాజేష్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

రాజాపూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం, మంద కృష్ణమాదిగ, అమరుల శ్రమ ఫలితమే అని గుర్తు చేసుకున్నారు. జంగయ్య, యాదయ్య, ఆనంద్, యాదగిరి, శేఖర్, ఆదిత్య, శివకుమార్, హనుమంతు పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా రాష్ట్ర బడ్జెట్

పాలమూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అభివృద్ధికి దూరంగా ఉందని బీఎస్పీ ఇన్‌చార్జి కిందింటి కృష్ణంరాజు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ బడ్జెట్ రాష్ట్రాన్ని సంక్షోభం లోకి నెట్టే ప్రమాదకరమైనదని అన్నారు. రుణభారాన్ని తగ్గిస్తూ రైతులు, యువతకు, ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం చేసే బడ్జెట్ ఉండాలని ఆయన డిమాండ్ చేశారు.

చలివేంద్రం ప్రారంభం

నవాబ్‌పేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మరికల్ గ్రామంలో శుక్రవారం ఎంపీడీవో జయరాములు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి చలివేంద్రం ప్రారంభించారు. అదనపు కలెక్టర్ మోహన్‌రావు ఆదేశానుసారం కూలీలు, బాటసారుల కోసం పంచాయతీల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్‌శర్మ, నిరంజన్ పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

దేవరకద్ర, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రుణాలు సకాలంలో తిరిగి చెల్లించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, అధికారి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయం వద్ద నిర్వహించిన మహాజన సభలో వారు మాట్లాడారు. రైతులు తీసుకున్న ఎల్‌టీ రుణాలను వెంటనే చెల్లించాలని, లేదంటే వారి భూములను వేలం వేస్తామన్నారు. 909 మందికి స్వల్ప, దీర్ఘకాలిక రుణాలిచ్చినట్లు తెలిపారు.

అరెస్టులు సరికావు: సీఐటీయూ

పాలమూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : చలో హైదరాబాద్‌కు తరలుతున్న సీఐటీయూ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయటం సరికాదని జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, చంద్రకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కార్మికులు తరలి వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జడ్చర్ల: హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు తరలివెళ్తున్న సీఐటీయూ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. తెలుగుసత్తయ్య, ఆకుల వెంకటేశ్, మున్నా తదితరులున్నారు.

బీసీ గురుకులంలో ప్రవేశాలు

కోయిలకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి బ్యాక్‌లాగ్ సీట్ల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా మార్చి31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జిల్లా కార్యవర్గ సభ్యుడికి సన్మానం

చిన్నచింతకుంట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ఎండీ రఫీక్ ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫొటోగ్రాఫర్లు ఆయనను శాలువాతో సత్కరించారు. ఫొటోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని రఫీక్ తెలిపారు. నజీర్, రఘు, శ్రీను, ఇసాక్, ఖాదర్ పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం కమిటీ ఎన్నిక

జడ్చర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : బులియన్ అసోసియేషన్, జడ్చర్ల స్వర్ణకార సంఘం కమిటీలను శుక్రవారం ఎన్నుకున్నారు. బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోల్కొండ రాజేశ్, ప్రధానకార్యదర్శిగా రాజగోపాలాచారి, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, జగదీశ్‌ను ఎన్నుకున్నారు. స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా చర్లపల్లి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా మాధవాచారి, ఉపాధ్యక్షులుగా రాఘవేందర్, గోల్కొండతేజలను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని సంఘం సభ్యులు సన్మానించారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

- గట్టి బందోబస్తు చేపట్టిన పోలీసులు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు



బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ వద్ద విద్యార్థులను స్ర్కీనింగ్ చేస్తున్న ఇన్విజిలేటర్లు

జడ్చర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏడు కేంద్రాలతో పాటు మండలంలోని కోడ్గల్ కేంద్రంలో పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 8 కేంద్రాలలో 1,801 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేయగా, ఐదుగురు గైర్హాజరయ్యారు.

మూసాపేట: అడ్డాకుల, మూసాపేట, జానంపేట పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం మొదటి రోజు విద్యార్థులు పరీక్ష రాశారు. అడ్డాకుల కేంద్రంలో 270 మంది విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరు కాగా, మూసాపేట, జానంపేట పరీక్ష కేంద్రాల్లో మొత్తం 359 మంది విద్యార్థులకు గాను ఒకరు హాజరు కాలేదు.

హన్వాడ: మండలంలో 535 మంది విద్యార్థులకు, 531 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో 263 మంది విద్యార్థులు హాజరుకాగా ఒకరు, వడ్డెమాన్‌లో కేంద్రంలోనూ 210మంది విద్యార్థులకు ఒకరు గైర్హాజరయ్యారు.

దేవరకద్ర: దేవరకద్ర, కౌకుంట్ల మండలాల్లో 860 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఎంఈవో బాల్‌రాం తెలిపారు.

భూత్పూర్: మండల కేంద్రంలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 449మందికి ఒకరు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి ఉషారాణి పేర్కొన్నారు.

నోటీసు బోర్డు లేక ఇబ్బంది పడిన విద్యార్థులు

కోయిలకొండ: మండల కేంద్రంలోని ఏ, బీ పది పరీక్ష కేంద్రంలో నోటీస్ బోర్డులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. గేటు బయట చేతిరాతతో చిన్న అక్షరాలతో కాగితాలు అంటించగా, లోపల ఏ గది వెళ్లాలన్న సమాచారం లేకపోవడంతో గందరగోళానికి గురయ్యారు. ఏ, బీ సెంటర్‌లో 410, గార్లపాడ్‌లో 122 విద్యార్థులు పరీక్షలకు హజరయ్యారు.

రాజాపూర్: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో 209 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు మండల విద్యాధికారి సుధాకర్ తెలిపారు. తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి పరిశీలించారు.

గండీడ్: మండలంలో రెండు కేంద్రాల్లో మొత్తం 377 మంది విద్యార్థులుకు, 375 మంది పరీక్ష రాసినట్లు మండల ఇన్‌చార్జి విద్యాధికారి జనార్దన్ తెలిపారు.

బాలానగర్: మండలంలోని చెన్నరేవల్లి, పెద్దరేవల్లి, ట్రైబల్ గురుకుల పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలలకు చెందిన 693 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

డివైడర్‌పై ఫోకస్ లైట్ల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



డివైడర్‌పై తొలగించిన ఫోకస్ లైట్లు

మహబూబ్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : డివై'ధర్' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. నగరంలోని న్యూటౌన్‌లో ఓ హోటల్ నిర్వాహకుడు ఏకంగా డివైడర్ మధ్యలో ఎల్ఈడీ లైట్లను అమర్చి హోటల్‌పై ఫోకస్ పడేలా ఏర్పాటు చేశాడు. ఎట్టకేలకు నగర పాలక సంస్థ అధికారులు స్పందించారు. కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్పొరేషన్ సిబ్బంది ఎల్ఈడీ లైట్లను తొలగించారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న కందూరు ఉత్సవాలు



ఆలయ కోనేరులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మూసాపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం కందూరు రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం అర్చకులచే ప్రత్యేక అభిషేక పూజలను చేపట్టారు. భక్తులు తరలివచ్చి ఆలయ కోనేరులో స్నానం ఆచరించి, స్వామిని దర్శించుకున్నారు. కల్పవృక్షాల కింద వంటలు చేసుకుని భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు కావాల్సిన వసతులు, సదుపాయాలను ఏర్పాటు చేశారు. శ్రీరామనవమి వరకు ఉత్సవాలు కొనసాగుతాయని సభ్యులు తెలిపారు.

ఆర్జేడీ వద్దకు స్పౌజ్ జీహెచ్‌ఎంల ఫైల్?

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : సెప్టెంబరు 2023లో జరిగిన జీహెచ్‌ఎం బదిలీల్లో స్పౌజ్ బదిలీల్లో నిబంధనలు పాటించకపోవడంపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై విచారణ చేపట్టిన డీఈవో జిల్లాలో స్పౌజ్ పాయింట్లు పొంది, నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిన 11 మందిపై ఆర్జేడీకి నివేదిక ఇచ్చారు. అయితే 2024 అక్టోబర్‌లో వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సుమారు పది రోజుల తర్వాత వారి విచారణ చేపట్టి, విధుల్లోకి తీసుకున్నారు. స్పౌజ్ పాయింట్ల తప్పిదాలపై పెండింగ్‌లో ఉన్న విచారణ పూర్తి చేసి మరో మారు ఇటీవల ఆర్జేడీకి పంపినట్లు తెలిసింది. దీనిపై ఆర్జేడీ పూర్తిగా పరిశీలించనున్నారు. తప్పు చేశారని తేలితే శాఖపరమైన చర్యలు ఉండే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు.

సీసీ రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలి

- ఈఈ నరేందర్‌రెడ్డి



బూర్గుపల్లిలో రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఈఈ నరేందర్‌రెడ్డి

కోయిలకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలని పంచాయతీరాజ్ ఈఈ నరేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని పారుపల్లి, బూర్గుపల్లి, గార్లపాడ్ గ్రామాల్లో సీసీ రోడ్డు, పంచాయతీ నిర్మాణ పనులను తనఖీ నిర్వహించారు. సీసీ రోడ్డు పై నీరు నిల్వ ఉండేలా చూడాలని ఆదేశించారు. మండలంలోని గ్రామాల్లో క్వాలిటీ కంట్రోలింగ్ అధికారులు సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలించారు. ఏఈ వెంకటేష్, కృష్ణయ్యయాదవ్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

జడ్చర్ల: సీసీ రోడ్డు పనులను శుక్రవారం మండలంలోని మాచారం గ్రామంలో ప్రారంభించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో రాపోతులశ్రీనివాస్‌గౌడ్, బాలవర్ధన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌నాయక్, శివశంకర్ రెడ్డి, తిరుపతి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గండీడ్: గ్రామాలను తీర్చిదిద్దుతున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మన్సూర్‌పల్లితండాలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.

ప్రభుత్వ పాఠశాలలో ఏఐ బోధన ప్రారంభం



చిన్నవార్వల్‌లో తరగతులను ప్రారంభిస్తున్న అధికారులు

గండీడ్ , మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ ఆధారిత బోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో దేవన్న, ఎంఈవో జనార్దన్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నవార్వల్ ప్రాథమిక పాఠశాలలో ఎచ్ఎం అరుణదేవి ఆధ్వర్యంలో ఎఫ్ఎల్ఎన్, ఏఎక్స్ఎల్ ల్యాబ్‌ను ఎంపీడీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ కంప్యూటర్ ఆధారంగా బోధన కొనసాగించేందుకు ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు నరసింహరావు, వీరసేనగౌడ్, సికిందర్, హరికృష్ణ, ఉమాదేవి, వెంకట్రాములు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వాలను అందజేస్తున్న అడ్‌హక్ కమిటీ సభ్యులు

మిడ్జిల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యులు బీసీ రామాంజనేయులు, శేఖర్ గౌడ్, వెంకట్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని యూనియన్‌సభ్యత్వ నమోదు చేపట్టారు. వారు మాట్లాడుతూ.. జర్నలిస్టులందరూ ఐక్యతతో ముందుకు సాగితేనే సమస్యల పరిష్కారానికి మార్గం సుగుమమై సంక్షేమ పథకాలు దక్కుతాయన్నారు. ఈ సందర్భంగా యూనియన్ మండల ప్రచార కార్యదర్శిగా బాలనారాయణను జిల్లా నాయకులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మహేష్‌కుమార్, సత్యంగౌడ్, శ్రీనివాసులు, భీంరాజు, అశోక్, పరంజ్యోతి, మల్లేష్, రమేష్, రాము, రమేష్‌గౌడ్, శ్రీనునాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీసీ యువతకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ బీసీ యువతకు హెవీ, లైట్ మోటారు వాహనాల డ్రైవింగ్ శిక్షణను రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆర్.ఇందిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగిన వారికి లైట్ మోటార్ వాహనం, 20 నుంచి 45ఏళ్ల వయస్సు కలిగిన వారికి హెవీ మోటార్ వాహనం నందు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కనీస విద్యార్హత 8వ తరగతి పాసై ఉండాలని సూచించారు. అభ్యర్థులకు ఉచితంగా వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 31లోపు బీసీ అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని ఆమె సూచించారు.

రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బీసీ నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాస్ పథకానికి ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి ఆర్. ఇందిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు జిల్లా కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్‌టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని చేనేత, డిజైనింగ్ వృత్తిలో నైపుణ్యం కలిగిన కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత సహాయ సంచాలకుడు డి. బాబు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులకు పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరలు, నారాయణపేట చీరలు, జనరల్ వెరైటీస్ ఉత్పత్తి రకములలో నైపుణ్యం కలిగి ఉండాలని కోరారు. అర్హులైన చేనేత కళాకారులు సహాయ సంచాలకులు చేనేత, జౌళి శాఖ జిల్లా కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తులను పొందాలని సూచించారు. ఏప్రిల్ 15 వరకు దరఖాస్తుకు అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మిడ్జిల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో బాధిత కుటుంబసభ్యులను మాజీ మంత్రి లక్ష్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. కొత్తూరు చెందిన పరమటి వెంకటయ్య ఇటీవల మృతి చెందగా కుటుంబసభ్యులను ఓదార్చారు. కిందపడి కాలు విరగడంతో మల్లేష్‌ను, కంచనపల్లి చెందిన బీఆర్ఎస్ నాయకుడు జంగయ్య తల్లి మృతిచెందడంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సుదర్శన్, పాండు, వెంకట్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కృష్ణయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అడవి శాతాన్ని పెంచాలి

జడ్చర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి అడవి శాతాన్ని పెంచాలంటూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మండలంలోని ఆలూరులో ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షరీఫ్, సుధాకర్‌రెడ్డి, అలీమ్, హరినాథ్, సోమ్లానాయక్, సంధ్య, హైమావతి, నిర్మలా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక నిల్వల పరిశీలన

మిడ్జిల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లి శివారులో ఉన్న టీఎస్ఎండీసీ స్టాక్ యార్డులో ఉన్న ఇసుకను రాత్రివేళ కొందరు టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారని రైతులు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో శుక్రవారం జిల్లా మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ సుజాత, ఆర్ఐ అంబిక, సర్వేయర్ ధనవంతి తహసీల్దార్ రాజు ఆదేశాల మేరకు అయ్యవారిపల్లి గ్రామంలోని ఇసుకను తరలించిన ప్రదేశాన్ని పరిశీలించారు. నివేదికను తహసీల్దార్‌కు అందజేసినట్లు తెలిపారు. పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



ఎమ్మెల్యేకు ఖర్జూర తినిపిస్తున్న ముస్లిం మతపెద్ద

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఏనుగొండలోని జేజేఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరుల్లాసిద్దీఖీ ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఎంతో నిష్టతో ముస్లింలు ఉపవాస దీక్షలు చేపడుతారని అన్నారు. జిల్లా, రాష్ట్ర సంక్షేమం కోసం ప్రార్థించాలని కోరారు. కార్యక్రమంలో మిథున్‌రెడ్డి, ఎన్పీ వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రీ, సురేందర్‌రెడ్డి, జాకీర్, మొయినద్దీన్, జాబేర్, రఫీక్‌పటేల్, మోయిన్‌అలీ, మక్సూద్ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల నివారణ పరిష్కార చట్టం 2013 గురించి వివరించారు. ప్రతి కార్యాలయంలో పది మంది మహిళలు పనిచేస్తే, ఒక అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు మాట్లాడుతూ పని ప్రదేశాలలో మహిళలపై వేధింపులు జరిగితే ఫిర్యాదు చేస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటారన్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి జరీనాబేగం మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో వివిధ కార్యాలయాల్లో 48 ఫిర్యాదు కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ముసాయిదా బేగం, పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

యథాస్థానంలో విగ్రహాలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో చర్చిస్తున్న నాయకులు

జడ్చర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో ఉన్న విగ్రహాలను యథాస్థానంలో ఏర్పాటు చేయాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో విగ్రహాల తొలగింపు, ఏర్పాటు అంశంపై మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటిపుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి, ఎన్‌హెచ్ఏఐ ఏఈ రవి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 167వ నెంబరు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా సిగ్నల్‌గడ్డపై ఉన్న శ్రీకాంతాచారి, జ్యోతిరావుపూలే, అంబేడ్కర్, నెహ్రూ, ఇందిరాగాంధీ విగ్రహాలను తొలగించాల్సిన పరిస్థితి ఉంది. జాతీయ రహదారిపై విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు లేవని, మునిసిపాలిటీలోని ఏ ప్రాంతంలోనైనా ఏర్పాటు చేస్తామని ఏఈ తెలిపారు. రోడ్డు పూర్తయిన అనంతరం విగ్రహాలను యథాస్థానంలో ఉంచాలంటూ నాయకులు డిమాండ్ చేశారు. కౌన్సిలర్ రఘురాంగౌడ్, ప్రశాంత్‌రెడ్డి, కుమ్మరిరాజు, రమేశ్, బుక్కమహేష్, బాదిమి రవిశంకర్, ఎడ్లబాలవర్ధన్‌గౌడ్, శ్రీకాంత్, శ్రీను, అనుపకృష్ణయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న 17వ వార్షికోత్సవాలు శుక్రవారం ముగిశాయి. సాయిబాబా కాగడ హారతి, గణపతిపూజ, నవగ్రహపూజ, కాశీ విశ్వేశ్వరుడి, సుబ్రమన్యేశ్వరుడి పూజలు నిర్వహించారు. గురువారం సాయిబాబా పల్లకీసేవలో వందలాదిగా భక్తులు పాల్గొన్నారు. బ్రహోత్సవాల చివరి రోజు అమ్మవార్లకు అభిషేకాలు, అనంతరం నవగ్రహ పూజ, పాశుపతహోమం చేపట్టారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

గండీడ్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల గ్రామ కమిటీ సమావేశం నిర్వహించి అర్హులైన వారి పేర్లను నమోదు చేశారు. పార్టీలకు అతీతంగా ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. చెన్నయ్య, భగవంత్‌రెడ్డి, సుదర్శన్‌రావు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలి

మూసాపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలని మండల ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అడ్డాకుల పీహెచ్‌సీ వైద్యాధికారి అయేషాకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో శ్రీదేవి, హైమావతి, శశికళ, పద్మ, లక్ష్మి, శ్యామల, ప్రవళిక, మంజుల, కృష్ణవేణి, రాధ, జ్యోతి పాల్గొన్నారు.

బీసీ గురుకులాన్ని తరలించొద్దు



హన్వాడలో ధర్నా చేస్తున్న నాయకులు

హన్వాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాలను జిల్లా కేంద్రానికి తరలించొద్దని శుక్రవారం వివిధ పార్టీ నాయకులు ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టి మాట్లాడారు. మండలంలోనే గురుకుల బాలికల పాఠశాల హాస్టల్ ఉండాలని డిమాండ్ చేశారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు. జంబులయ్య, యాదయ్య, ఎజాజ్, శ్రీను, శ్రీనివాస్‌గౌడ్, రాజు, ఖదీర్‌దాస్, వెంకటేశ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం నాయకుల అరెస్టు



భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ముదిరాజ్ సంఘం నాయకులు

భూత్పూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదని నిరసిస్తూ శుక్రవారం అసెంబ్లీ ముట్టడి చేపట్టారు. ఇందులో భాగంగా సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల నాయకులు వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని వారిని పోలీస్‌స్టేషన్ తరలించారు. బీసీలను డీ గ్రూపు నుంచి ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఎర్రబాలప్ప, బోల వెంకట్ రాములు, సత్యనారాయణ, అంజన్న, రవీందర్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

మూసాపేట: ముందస్తుగా అడ్డాకులలో ముదిరాజ్ సంఘం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో మేస్త్రీ రాములు, డీలర్ లక్ష్మీనర్సింహ, కృష్ణయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం

పాలమూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్ మండలం మాచన్‌పల్లిలో జిల్లా కమిటీ సమస్యలను పరిశీలించింది. డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నట్లు వివరించారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, వ్యవసాయ కూలీలకు రూ.12,500, సీసీరోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధాప్య, వితంతు పింఛన్లు, దివ్యాంగులకు, చేతివృత్తుల పింఛన్లు తక్షణమే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో హనుమంతు, మోహన్, భగవంతు, ఖాదర్ పాల్గొన్నారు.

వార్డులో సమస్యలను పరిష్కరించాలి

జడ్చర్ల: మునిసిపాలిటీలోని ఐదవ వార్డు నాగసాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకుడు జగన్ కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో వార్డులో నెలకొన్న సమస్యలపై శుక్రవారం సర్వే నిర్వహించారు. వార్డులో చెత్త పేరుకుపోయిందని, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో దుర్వాసన వస్తుందన్నారు. జయరాములు, శ్యాంసుందర్, నర్సింహులు, ప్రసాద్ పాల్గొన్నారు.